


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
డిసెంబరు 20, 2024

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 10 వెల 4/-



## లోక్ సభలో తోపులాట

- బిజెపి ఎంపికి గాయాలు
- బిజెపి సభ్యుడు ప్రతాప్ సారంగికి గాయాలు
- కాంగ్రెస్ సభ్యులు తనను తోసివేశారంటూ ఆరోపణ
- బిజెపి సభ్యులే తనను అడ్డుకున్నారన్న రాహుల్

**న్యూఢిల్లీ :** లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురించి కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు ఆయన క్షమాపణలు చెప్పాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు పట్టుబట్టారు. ఈ క్రమంలో లోక్ సభలోకి వెళ్లేందుకు అధికార , విపక్ష ఎంపీల వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సందర్భంలో వారి మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఒక ఎంపీ తలకు గాయాలయ్యాయి.

**కాంగ్రెస్, బిజేపీ పోటాపోటీ నిరసనలు...**

రాజ్యసభలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యాలను నిరసిస్తూ, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు ఆవరణలో అంబేద్కర్ ఫొటోలు పట్టుకొని నిరసన చేశారు. అలాగు పార్లమెంటు ఆవరణలో అంబేద్కర్ ఫొటోలను చేతిలోపట్టుకొని ఉన్నా కాంగ్రెస్ ఎంపీల ఫోటోలను బిజేపీ సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసి పోస్ట్ చేసింది. దీంతో కాంగ్రెస్ ఎంపీలు లోక్ సభలో గురువారం బిజేపీ క్షమాపణలు చెప్పాలని నిరసన చేశారు. హెూం మంత్రి అమిత్ షా

మిగతా 2లో

## అమరావతి పనులకు చంద్రబాబు మంత్రి వర్గం గ్రీన్ సిగ్నల్



**అమరావతి:** అమరావతి పనులకు ఏపీ కేబినేట్ ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 21 అంశాలతో కూడాన ఏజెండాపై ఈ భేటీలో చర్చించి.. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి రాజధానిలో మొత్తం 20 ఇంజనీరింగ్ పనులకు 8821 కోట్లు పరిపాలన అనుమతులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతిలో 25 ఇంజనీరింగ్ పనులు చేపట్టేందుకు 24,316 కోట్లు మంజూరుకు ప్రతిపాదనకు

మిగతా 2లో

- ఏపీ కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు ఎస్టీరంగా వర్సిటీకి 50 ఎకరాల భూమి
- జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం
- పోలవరం ప్రాజెక్టు కోసం కొత్త టెండర్లు
- ధాన్యం కొనుగోలుకు మరో 1000 కోట్ల సాయం
- మంత్రి మండలి భేటీలో 21 అంశాలపై చర్చ
- కొన్ని కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన కేబినెట్

## ఈ కార్ రేస్ స్కామ్ - కెటిఆర్ ఎ1గా కేసు నమోదు



**హైదరాబాద్ :** ఫార్ములా–ఈ కార్ రేసింగ్ స్కామ్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎం డీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని చేర్చారు. విదేశీ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేకుండానే రూ. 55కోట్లు చెల్లించారనే ఆరోపణలతో

మిగతా 2లో

## అప్పులపై బిఆర్ఎస్ చెబుతున్నవన్నీఅబద్ధాలే

### ఉప ముఖ్యమంత్రి భట్టి



**హైదరాబాద్ :** అప్పులపై బిఆర్ ఎస్ నేతలు చేబుతున్నవన్నీఅబద్దాలేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.. వివిధ కార్పొరేషన్ ల ద్వారా రుణాలు తీసుకున్న కెసిఆర్ ప్రభుత్వం వాటిని మాత్రం వెల్లడించడం లేదని చెప్పారు.. ఆర్థిక పరిస్థితిపై నేడు అసెంబ్లీలో నేడు జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడతూ, బిఆర్ఎస్ చేసిన అప్పులపై సుదీర్ఘంగా

మిగతా 2లో




## కోర్టులు ఆదేశిస్తే తప్ప పని చేయరా?

- జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై హైకోర్టు అగ్రహం
- అక్రమ నిర్మాణాలు జరుగుతోంటే ఏం చేస్తున్నారు?
- ప్రజలు ఫిర్యాదు చేస్తే స్పందించకుంటే ఎలా?
- మీపై ప్రజలకు కనీస విశ్వాసం లేకుండాపోతోంది
- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పలు సూచనలు చేసిన జస్టిస్ కె.లక్ష్మణ్



## పార్లమెంట్ ప్రాంగణంలో తీవ్ర ఘర్షణ

ఎన్డీయే, ఇండియా ఎంపీల మధ్య తోపులాట
రాహుల్ గాంధీపై కేసు నమోదు
బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లకు గాయాలు

## తెలియదు.. నాకు గుర్తులేదు..!

- కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలకు స్మితాసబర్వాల్ సమాధానాలు
- బ్యారేజీలు ఎప్పుడు ప్రారంభించారో తెలియదు: మాజీ సీఎస్ సోమేశ్
- నేడు విచారణకు వెదిరె శ్రీరామ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- కమిషన్‌కు మాజీ సీఎస్ సోమేశ్ సమాధానం



హైదరాబాద్, డిసెంబరు 19 : కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చిత్రమైన జవాబులు ఇచ్చారు. కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు ఆమె.. 'తెలియదు.. నాకు గుర్తులేదు.. మరిచిపోయా' అనే సమాధానాలు ఇవ్వడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి 2023 డిసెంబరు దాకా సీఎంవో కార్యదర్శిగా ఉంటూ

(మిగతా 2వ పేజీలో)



## ఔటర్ టెండర్‌పై సిట్

- హరీశ్, కేటీఆర్ కోరిక మేరకేనని వెల్లడి
- అప్పు తెచ్చి ఓఆర్ఆర్‌ను కాంగ్రెస్ నిర్మిస్తే..
- ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ అమ్మేసింది
- దేశం దాటి వెళ్లాలన్న ఆలోచనతోనే విక్రయం: రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 19 : గత ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)ను ఓ ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇచ్చిన వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సదరు లీజు సహా టెండరుపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో గురువారం ఆయన ప్రకటించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌తోపాటు రాష్ట్ర ప్రజల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మంత్రివర్గంలో చర్చించి, మంత్రుల సూచన, తీర్మానంతోనే విచారణకు ఆదేశిస్తున్నట్టు చెప్పారు. గురువారం మధ్యాహ్నం విరామం తరువాత ప్రారంభమైన శాసనసభలో రాష్ట్ర అప్పులపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. ఆ చర్చలో భాగంగా ఓఆర్ఆర్ లీజు టెండర్లను రద్దు చేయండంటూ హరీశ్ రావు, కేటీఆర్ కామెంట్లు చేశారు. దాంతో, ముఖ్యమంత్రి రేవంత్ జోక్యం చేసుకుని.. "అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6,500 కోట్లను అప్పు తెచ్చి ఓఆర్ఆర్‌ను నిర్మించింది. తర్వాత ఆ బాకీ కూడా తీర్చేసింది. అలాంటి ఔటర్ రింగు రోడ్డును అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పనంగా అమ్మేశారు. హడావిడిగా లీజుకు ఇచ్చారు. ఎన్నికల్లో ప్రజలు వారిని తిరస్కరించనున్నారని, ఓడించబోతున్నారని,

(మిగతా 2వ పేజీలో)



## తప్పు చేయకుంటే భయమేల?

- తొలిసారి రేస్‌తో రూ.200 కోట్ల నష్టం
- అందుకే ప్రమోటర్ మళ్లీ రాలే
- తెలిసీ రూ.55 కోట్లిచ్చారు: పొన్నం




## మణికొండలో హైడ్రా కూల్చివేతలు!

- అపార్ట్‌మెంట్‌లో దుకాణాల నేలమట్టం..
- అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదుతో హైడ్రా యాక్షన్

హైదరాబాద్, డిసెంబరు 19 : హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ(హైడ్రా) మణికొండలో అక్రమ కట్టడాలపై యాక్షన్‌లోకి దిగింది. నివాస క్యాటగిరీలో అనుమతులు తీసుకున్న ఓ అపార్ట్‌మెంట్‌లో.. వాణిజ్య పరంగా వాడుతున్న దుకాణాలను గురువారం స్థానిక మునిసిపల్ అధికారులతో కలిసి, కూల్చివేసింది. స్థానిక

(మిగతా 2వ పేజీలో)



## ప్రభుత్వ అప్పులపై భట్టి వర్సెస్ హరీశ్

- పదేళ్లలో బీఆర్ఎస్ తీసుకున్న రుణాలు రూ.7.11లక్షల కోట్లు
- అప్పులకు అసలు, వడ్డీలే రూ.63 వేల కోట్లు చెల్లించాం
- ఆర్బీఐకి వివరాలిచ్చింది హరీశే.. ఎవరికి సభా హక్కుల నోటీసు ఇవ్వాలో చెప్పండి: భట్టి
- మేం తీసుకున్నది 4.17 లక్షల కోట్లే.. చేయని అప్పులను మా ఖాతాలో వేస్తే నోటీసులు: హరీశ్

# ఏ1గా కేటీఆర్



'బి' వచ్చారు! కొన్ని రోజుల తర్వాత నష్టం వస్తోందని 'బి' వెళ్లిపోయారు! నిజానికి, ఇక్కడ ఎగ్జిబిషన్‌కు భూమి ఇవ్వడం వరకే మీ బాధ్యత. కానీ, ఎగ్జిబిషన్ ఏర్పాటుకు, ప్రచారానికి కూడా మీరే ఎదురు డబ్బులు ఇస్తారా!? అది కూడా.. మీ డబ్బులు కాకుండా ఈ వ్యవహారంతో అస్సలు ఏమాత్రం ఏ సంబంధం లేని పక్క వాళ్ల డబ్బులు ఇస్తారా!? ఈ క్రమంలో అన్ని నిబంధనలను తుంగలో తొక్కుతారా!? ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దాని ప్రకారం ఫార్ములా ఈ కేసు ఇదే! హైదరాబాద్‌లో ఫార్ములా ఈ కారు రేసు నిర్వహించడానికి 2022 అక్టోబరులో మూడు పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. వాటిలో ఒకటి.. బ్రిటన్‌కు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈవో). రెండోది, తెలంగాణ ప్రభుత్వం. మూడోది, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ (స్పాన్సర్). ఫార్ములా 1 తరహాలోనే ఫార్ములా ఈ రేసులూ జరుగుతుంటాయి. వీటి 9, 10, 11, 12 సీజన్లను హైదరాబాద్‌లో నిర్వహించడమే ఈ ఒప్పందం. దీని ప్రకారం ట్రాక్ నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాల కల్పన మాత్రమే ప్రభుత్వ బాధ్యత. ఇందులో భాగంగా మొదటి రేస్ 11.2.23వ తేదీన పూర్తయింది. ఇందుకు హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. సంబంధిత ఫీజు, ఇతర చెల్లింపులను స్పాన్సర్ సంస్థ చేసింది. మొదటి సీజన్ తర్వాత ఎఫ్ఈవోకు, స్పాన్సరర్‌కు మధ్య విభేదాలు వచ్చాయి. ఒప్పందం నుంచి ఏస్ నెక్స్ట్ జెన్ తప్పుకుంది. ఇంకా కొంత ఫీజు మొత్తాన్ని కూడా చెల్లించాల్సి ఉంది. దీంతో, పురపాలక శాఖ అధికారులు, ఎఫ్ఈవో మధ్య చర్చలు జరిగాయి. స్పాన్సర్ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, ఫీజు కూడా ప్రభుత్వమే చెల్లించాలని భావించారు. రాష్ట్ర ప్రభుత్వమే స్పాన్సరర్‌గా ఉంటుందని మంత్రి కేటీఆర్ మౌఖికంగా చెప్పడంతో అప్పట్లో హెచ్ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చూస్తున్న పురపాలక శాఖ స్పెషల్ సీఎస్ ఫైల్ పంపారు. గత స్పాన్సరర్ స్థానంలో పురపాలక శాఖ ఉంటుందని, మొత్తం రూ.160 కోట్లు ఖర్చవుతుందని అందులో పేర్కొన్నారు. దానిపై అదే రోజు కేటీఆర్ సంతకం చేశారు.

### ఒప్పందం జరగక ముందే చెల్లింపులు

సదరు ఫైల్‌ను 27.9.23న మంత్రి కేటీఆర్‌కు పంపారు. కానీ, అంతకు రెండు రోజుల ముందు అంటే 25వ తేదీనే ఎఫ్ఈఓ ప్రమోటర్ ఫీజు కింద రూ.22,69,63,125 చెల్లించాలంటూ ఇన్వాయిసను హెచ్ఎండీఏకి పంపింది. మరో నాలుగు రోజుల్లో రూ.23,01,97,500 రూపాయలకు సంబంధించి మరో ఇన్వాయిస్ పంపింది. నిజానికి, అప్పటికి ఇంకా ప్రభుత్వానికి ఎఫ్ఈఐకి మధ్య రాతపూర్వక ఒప్పందం జరగలేదు. కానీ, ఈ రెండు ఇన్వాయిసలకు సంబంధించి డాలర్లలో హిమాయత్ నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా 2023 అక్టోబర్ 3న, 11న చెల్లింపులు చేసేశారు. ఈ మేరకు హెచ్ఎండీఏ చీఫ్ మేనేజర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

### అనుమతుల్లేకుండానే చెల్లింపులు

నిజానికి.. ఇక్కడ హెచ్ఎండీఏకు, ఎఫ్ఈవోకు ఏ సంబంధం లేదు. కానీ, హెచ్ఎండీఏ ఖాతా నుంచి చెల్లింపులు జరిపేశారు. అంతేనా.. అంత భారీ మొత్తాలను బదిలీ చేసినా.. అందుకు ఎవరి నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. డాలర్లలో విదేశాలకు డబ్బులు చెల్లిస్తే ఆర్బీఐ నుంచి అనుమతి తీసుకోవాలి. దానిని తీసుకోలేదు. ఇక, ఆర్థిక శాఖ నుంచి కానీ న్యాయ శాఖ నుంచి కానీ అనుమతి తీసుకోలేదు. పైగా విదేశీ చెల్లింపులు చేసినందుకు హెచ్ఎండీఏకు ఆదాయ పన్ను కింద రూ.8.06 కోట్లు అదనపు భారం కూడా పడింది. వెరసి, హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.54,88,87,043 చెల్లించారు. నిజానికి, హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం.. పది కోట్లకు మించి ఖర్చు చేస్తే ఆర్థిక శాఖ ద్వారా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ, ఎటువంటి అనుమతి తీసుకోలేదు. అలాగే, భవిష్యత్తులో మరిన్ని చెల్లింపులు చేయాల్సి ఉంటే మంత్రిమండలి ఆమోదం కూడా తీసుకోవాలి. కానీ, దానిని కూడా తీసుకోలేదు. భవిష్యత్తులో ఎప్పుడో చేసుకోబోయే ఒప్పందాన్ని ఉద్దేశించి ముందే చెల్లింపులు జరిపేశారు. ఈ కేసులో ఇది తీవ్ర ఉల్లంఘనగా ఎఫ్ఐఆర్‌లో ఏసీబీ పేర్కొంది.

### ఎన్నికల కోడ్ ఉల్లంఘన కూడా

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 9.10.23న కోడ్ అమల్లోకి వచ్చింది. కానీ, చెల్లింపులు చేసిన తర్వాత 30.10.23న ఎఫ్ఈవోతో పురపాలక శాఖ మరో ఒప్పందం చేసుకుంది. దాని ప్రకారం, స్పాన్సర్ ఫీజు రూ.90 కోట్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలనూ రాష్ట్ర ప్రభుత్వమే కల్పిస్తుందని అందులో పేర్కొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండగా ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకోకుండా ఈ ఒప్పందం చేసుకోవడాన్ని ఉల్లంఘనగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆర్థిక శాఖతోపాటు అధీకృత అథారిటీ ఆమోదం లేకుండా రూ.54.88 కోట్లు ఎఫ్ఈవోకు చెల్లించడం నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఒప్పందంలో హెచ్ఎండీఏ భాగస్వామి కాకపోయినా.. ఒప్పందానికి ముందే హెచ్ఎండీఏ ఖాతా నుంచి చెల్లింపులు జరపడం ఏమిటని విస్మయం వ్యక్తం చేసింది. ఈ అంశాలపైనే ప్రధానంగా ఏసీబీ విచారణ చేయనుంది. అలాగే, డాలర్లలో చెల్లింపులు చేయడం ఫారిన్ ఎక్స్ఛేంజి నిబంధనలకు విరుద్ధం. దీనిపైనా ఏసీబీ దృష్టి సారించనుంది. ఒప్పందం ప్రకారం, రాబోయే మూడేళ్లలో అదనపు ఖర్చులతోపాటు రూ.600 కోట్ల వరకూ చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు సంబంధిత అథారిటీ నుంచి అనుమతి తీసుకోలేదని పేర్కొంది. దీనిపైనా ఏసీబీ దృష్టి సారించనుంది.

# పార్లమెంట్ ప్రాంగణంలో తీవ్ర ఘర్షణ

కలిగించాయి. మొత్తానికి పార్లమెంట్ సాక్షిగా గురువారం దిగ్భ్రాంతికర సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఉదయం ఉభయ సభలు ప్రారంభం కావడానికి కొన్ని నిమిషాల ముందు విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నీలం రంగు దుస్తులు ధరించి, అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రాతోపాటు కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల సభ్యులు ఈ నిరసనలో పాల్గొన్నారు. తర్వాత వారంతా మకరద్వారం గుండా పార్లమెంట్ లోపలికి ప్రవేశించేందుకు ముందుకు కదిలారు. అప్పటికే అక్కడ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎంపీలు బైఠాయించారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ కించపర్చిందని ఆరోపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బిగ్గరగా నినాదాలు ప్రారంభించారు. మకరద్వారం మెట్లపై ఇరువర్గాలు పరస్పరం ఎదురుపడ్డాయి. తాము ముందుకెళ్లడానికి దారి ఇవ్వడం లేదని ఇండియా కూటమి ఎంపీలు మండిపడ్డారు. దాంతో ఎన్డీయే ఎంపీలు మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. ఇండియా కూటమి సభ్యులు సైతం స్వరం పెంచారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. తోపులాటలు, అరుపులు కేకలతో ఈ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. అసలేం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. తోపులాటలో కొందరు ఎంపీలు కిందపడ్డారు. మెట్ల మధ్యభాగంలో నిలబడిన తమను రాహుల్ గాంధీ బలంగా తోసివేశారని బీజేపీ ఎంపీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందుకెళ్లడానికి పక్కనే తగినంత దారి ఉన్నప్పటికీ ఆయన తమపై ఉద్దేశపూర్వకంగా దురుసుగా ప్రవర్తించారని అన్నారు. రాహుల్ గాంధీ తోసివేయడంతో తమ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్ గాయపడ్డారని చెప్పారు. నడవలేని స్థితిలో ఉన్న సారంగిని చక్రాల కుర్చీలో అంబులెన్స్ దాకా తీసుకెళ్లారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అయితే, బీజేపీ ఎంపీలే దారికి అడ్డంగా నిల్చొని, రాహుల్ గాంధీని ముందుకు వెళ్లనివ్వలేదని కాంగ్రెస్ సభ్యులు చెప్పారు. తమను రెచ్చగొట్టేలా ప్రవర్తించారని బీజేపీ సభ్యులపై విరుచుకుపడ్డారు.

### మోదీ పరామర్శ

పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన ఘర్షణలో గాయపడిన ప్రతాప్ సారంగితోపాటు ముకేశ్ రాజ్‌పుత్ చికిత్స నిమిత్తం ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చేరారు. సారంగి కణతకు కుట్లు పడ్డాయి. ముకేశ్ రాజ్‌పుత్ తలకు గాయాలయ్యాయి. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ వారిద్దరినీ ఫోన్‌లో పరామర్శించారు. జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే ఎంపీలు సైతం ఆసుపత్రికి చేరుకొని ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లను పరామర్శించారు.

### బీజేపీ ఎంపీలు కర్రలతో బెదిరించారు: రాహుల్

బీజేపీ ఎంపీలు తనపై బల ప్రయోగం చేశారని, దురుసుగా తోసివేశారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. కింద పడిపోయానని, తనకు గాయాలయ్యాయని చెప్పారు. బీజేపీ ఎంపీలే తమపై దౌర్జన్యానికి పాల్పడి, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ప్రాంగణంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై బీజేపీ ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. బీజేపీ ఎంపీలే తమపై భౌతిక దాడులు చేశారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. కర్రలు చేతపట్టుకొని తమను అడ్డుకున్నారని, బెదిరించారని, పార్లమెంట్ లోపలికి వెళ్లనివ్వలేదని చెప్పారు. తమ ఎంపీ సారంగిని రాహుల్ గాంధీ నెట్టివేశారని, రౌడీలా ప్రవర్తించారని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే దుయ్యబట్టారు. ఒక వృద్ధుడిని నెట్టివేసినందుకు రాహుల్ సిగ్గుపడాలని అన్నారు. తాను నాలుగుసార్లు ఎంపీగా గెలిచానని, తన రాజకీయ జీవితంలో ఇలాంటి దారుణమైన ఘటన ఏనాడూ చూడలేదని స్పష్టంచేశారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ అనేది బల ప్రదర్శనకు వేదిక కాదని, కుస్తీలు పట్టడానికి రెజ్లింగ్ రింగ్ కాదని సూచించారు. గురువారం నాటి ఘర్షణపై తగిన చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు.


### అమిత్ షాపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

అంబేడ్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కేంద్ర మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం రాజ్యసభలో సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు ఈ నోటీసు అందజేశారు. రాజ్యసభ సాక్షిగా రాజ్యాంగ నిర్మాతను అమిత్ షా అవమానించారని ఖర్గే ఆరోపించారు.

### పార్లమెంట్‌లోకి వెళ్తుంటే ఎగతాళి చేశారు

తాము పార్లమెంట్‌లోకి వెళ్తుండగా బీజేపీ ఎంపీలు ఎగతాళి చేశారని, లోపలకి వెళ్లకుండా అడ్డుకున్నారని కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆరోపించారు. అంబేడ్కర్‌ను అవమానించినందుకు హోంమంత్రి పదవికి అమిత్ షా రాజీనామా చేయాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారు గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అమిత్ షాను కాపాడేందుకు బీజేపీ ముందస్తుగానే కుట్ర పన్నిందని విమర్శించారు. మొత్తం గొడవకు రాహుల్ గాంధీ కేంద్ర బిందువుగా మారారు. ఆయనపై బీజేపీ నేతలు పార్లమెంట్ హౌస్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం, భౌతిక దాడి, హింసకు ప్రేరేపించడం వంటి ఆరోపణలతో ఫిర్యాదు అందించారు. రాహుల్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాంగ్రెస్ నేతలు సైతం బీజేపీ ఎంపీలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కూడా కలిశారు. రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీలు దారుణంగా ప్రవర్తించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఓం బిర్లాకు ఫిర్యాదు అందజేశారు. మల్లికార్జున ఖర్గే సైతం ఓం బిర్లాకు లేఖ రాశారు. బీజేపీ ఎంపీల దాడిలో తన మోకాలికి గాయమైందని పేర్కొన్నారు. ఈ దాడిపై దర్యాప్తు జరపాలని కోరారు. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు కూడా కాంగ్రెస్ ఎంపీలు ఫిర్యాదు చేశారు. బీజేపీ నేతలు సైతం కాంగ్రెస్ ఎంపీలపై లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.

# ఔటర్ టెండర్‌పై సిట్



బొంద పెట్టబోతున్నారని వారికి స్పష్టంగా తెలుసు. అందుకే, ఉన్నదల్లా తెగనమ్ముకుని దేశం విడిచి పారిపోవాలన్న ఆలోచనతో ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు హయాంలోనే దీనిని విక్రయించారు. మళ్లీ ఇప్పుడు వారిద్దరే (హరీశ్, కేటీఆర్) విచారణ జరపాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వారిద్దరి కోరిక మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) నియమిస్తున్నాను. ప్రధాన ప్రతిపక్షం కోరిక మేరకు ఔటర్ టెండర్‌ను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విధానాలపై సభలోని సభ్యులందరి ఆమోదంతో విచారణకు ఆదేశిస్తున్నాను" అని వివరించారు. సంబంధిత విధివిధానాలను మంత్రివర్గంలో చర్చించి ఖరారు చేస్తామని చెప్పారు.

### ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్‌ను పెట్టింది కాంగ్రెస్సే

సరైన విధివిధానాలను పాటించకుండా ఎన్నికలకు ముందు హడావిడిగా కొంతమంది వ్యక్తులకు అయాచిత లబ్ధి చేకూర్చడానికి ఔటర్ రింగు రోడ్డును అప్పగించేశారంటూ తెలంగాణ సమాజంలో తీవ్రమైన చర్చ జరిగిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. "ఆనాడు వైఎసఆర్ హయాంలో కాంగ్రెస్ పార్టీ జైకా నుంచి నిధులను తీసుకొచ్చి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుతోపాటు ఓఆర్ఆర్ లాంటి అద్భుతమైన మణిహారాలను నిర్మించింది. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా రాణించడానికి ఈ రెండూ ప్రధాన కారణం. గతంలో కాంగ్రెస్ అవలంభించిన విధానాల వల్లే బడ్జెట్‌లో 60-65 శాతం ఆదాయం సమకూరుతోంది. తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు రూ.2 లక్షల కోట్లపైచిలుకు బడ్జెట్‌కు వెళ్లడానికీ కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన ప్రాజెక్టులే కారణం" అని వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టును తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్సేనని చెప్పారు. హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలు, ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైలు, ఐటీ, ఫార్మా కంపెనీలు తీసుకు రావడమే కాకుండా శాంతి భద్రతలు కాపాడడం, మత సామరస్యాన్ని పెంపొందించడం వంటి విధానపరమైన కఠిన నిర్ణయాలను తీసుకుందని వివరించారు. అలాగే, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్‌ను ఏడాది మొత్తం అందించిందని గుర్తు చేశారు. ఐఎస్‌బీ, ఐఐటీ, ఐఐఐటీలతోపాటు అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలను అప్పటి ప్రభుత్వాలు తీసుకొచ్చాయని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి స్టేడియాలను నిర్మించారని, అంతర్జాతీయ స్థాయి క్రీడలను ఇక్కడ నిర్వహించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని, ఫలితంగా ఇప్పుడు రూ.2 లక్షల కోట్ల పైచిలుకు బడ్జెట్‌కు చేరామని, వీటి ద్వారానే ప్రధాన ఆదాయం వస్తోందని చెప్పారు.

### సీఎంను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సీఎం రేవంత్ రెడ్డిని అసెంబ్లీలోని ఆయన చాంబర్లో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్ రెడ్డిలు కలిశారు. అయితే ఏ పార్టీ ఎమ్మెల్యేలయినా నియోజకవర్గ సమస్యలపై సీఎంను కలుస్తుంటారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకే కలిశారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

## తెలియదు.. నాకు గుర్తులేదు..!

నీటిపారుదల శాఖ వ్యవహారాలు చూసిన స్మితను కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో భాగంగా గురువారం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. 'మంత్రివర్గ ఆమోదం లేకుండా, ఆర్థిక శాఖ సమ్మతి లేకుండానే కేవలం సీఎం ఆమోదంతో మేడిగడ్డ బ్యారేజీకి రూ.2591 కోట్లు, అన్నారం బ్యారేజీకి రూ.1785 కోట్లు, సుందిళ్ల బ్యారేజీకి రూ.1437 కోట్లతో 2016 మార్చి 1న పరిపాలన అనుమతులు జారీ చేశారా?' అని ప్రశ్నించగా.. 'నాకు తెలియదు' అని స్మిత బదులిచ్చారు. మంత్రి(టి.హరీశ్) స్వయంగా సీఎం వద్దకు ఫైల్స్ తీసుకెళ్లి ఆమోదం తీసుకొని ఉండొచ్చని, సీఎం వద్దకు వెళ్లే ప్రతీ ఫైల్ తన ద్వారానే వెళ్లదని, కొన్ని సందర్భాల్లో నేరుగా కూడా తీసుకెళతారని చెప్పారు.

## తప్పు చేయకుంటే భయమేల?

హైదరాబాద్, డిసెంబరు 19 : ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి ఏ తప్పూ చేయకపోతే.. విచారణకు కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇప్పుడు దీనిపై ఎఫ్ఐఆర్ నమోదైందనే భయంతోనే అసెంబ్లీలో చర్చించాలని అంటున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై కేటీఆర్ ప్రెస్‌మీట్‌కు స్పందనగా.. పార్టీ ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, విజయ రమణారావు, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పు జరగకపోతే ఏసీబీ ముందే కేటీఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలని ఆయన సూచించారు. ఫార్ములా ఈ రేస్ హైదరాబాద్‌లో మొదటిసారి నిర్వహించినప్పుడు నష్టం వచ్చిందని మంత్రి గుర్తుచేశారు. "ఫార్ములా ఈ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ పెరిగిందా? లేదా? ట్యాంక్ బండ్, ఐమ్యాక్స్ చుట్టూ ఉన్నవారు ఇబ్బంది పడ్డారా? అనేది ప్రజలకు తెలుసు. దీనిపై గొప్పలు చెప్పుకుంటే తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలూ నవ్వుకుంటారు. మొదటిసారి ఫార్ములా ఈ రేస్‌తో భారీగా నష్టం జరగడంతో రెండోసారి ప్రమోటర్ కూడా ముందుకు రాలేదు. ఇదంతా తెలిసినప్పటికీ హెచ్ఎండీఏ వైస్‌చైర్మన్‌గా ఉన్న కేటీఆర్ ఎందుకు రూ.55 కోట్లు చెల్లించారు? అది ప్రజాధనమని మరిచిపోయారా? లేక అవి ఆయన సొంత డబ్బులా?" అని దుయ్యబట్టారు. అధికారం ఉంది కదా అని దుర్వినియోగం చేయడంతో పాటు.. మళ్లీ అధికారంలోకి వస్తామనే అహంకారంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది నిజం కాదా అని నిలదీశారు. "హెచ్ఎండీఏ డబ్బును ఎవరి అనుమతీ లేకుండా వాడుకునే వీలుందా? డబ్బులు బదిలీ చేసేందుకు ఎవరి అనుమతి తీసుకున్నారు? అప్పటి మంత్రివర్గంలో చర్చ జరిగిందా? అప్పటి ముఖ్యమంత్రి ఆమోదించారా? ఆర్థిక శాఖ అనుమతి ఉందా? అసలు ఎవరి అనుమతీ లేకుండా విదేశాలకు తెలంగాణ ప్రభుత్వం డబ్బును ఎలా బదిలీ చేసింది? నిబంధనలు పాటించాలనే కనీస ధర్మం పాటించవద్దా? ప్రజాధనమంటే అంత చులకనా? అక్టోబర్ 5, 11 తేదీల్లో ఎఫ్ఐఏకు డబ్బులు బదిలీ చేసినట్లు బాహాటంగా చెప్పుకుంటున్న కేటీఆర్‌కు అప్పుడు ఎన్నికల షెడ్యూలు విడుదలైన విషయం తెలియదా? ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు డబ్బుల చెల్లింపులు చేయటం నేరం కాదా?" అని మంత్రి పొన్నం ప్రభాకర్ నిప్పులు చెరిగారు.

## మణికొండలో హైడ్రా కూల్చివేతలు!

అల్కాపురి కాలనీలో 'అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్' గ్రౌండ్ ఫ్లోర్‌లోని మడిగెల్లో పలు వాణిజ్య దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈ అపార్ట్‌మెంట్‌కు సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, ఐదంతస్తులకు నివాస క్యాటగిరీలో హెచ్ఎండీఏ అనుమతులున్నాయి. అయితే.. బిల్డర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో షెట్టర్లు ఏర్పాటు చేసి, దుకాణాలకు అద్దెకిచ్చాడు. ఇలా ఈ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఓ బ్యాంకు, ఇతర వాణిజ్య దుకాణాలున్నాయి. వీటి ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. వీటి వల్ల పార్కింగ్, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయంటూ అపార్ట్‌మెంట్‌లోని 32 ఫ్లాట్ల యజమానులు మణికొండ మునిసిపాలిటీ, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని సీరియ్‌సగా తీసుకున్న మునిసిపల్ అధికారులు.. బిల్డర్‌కు నోటీసులు ఇచ్చారు. వాటికి సమాధానం రాకపోగా.. మడిగెల అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో హైడ్రా, మునిసిపల్ అధికారులు గురువారం ఉదయం రంగంలోకి దిగి, వాణిజ్య దుకాణాలను కూల్చివేశారు. పాత నిర్మాణాల జోలికి వెళ్లబోమని ఇటీవలే పేర్కొన్న హైడ్రా మణికొండలో ఏకపక్షంగా వ్యవహరించిందంటూ కూల్చివేతల సమయంలో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. కూల్చివేతకు గురైన ఓ దుకాణంలో కూరగాయలు విక్రయించే మహిళ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. దుకాణానికి ఆస్తిపన్ను, విద్యుత్తు బిల్లులను వాణిజ్య క్యాటగిరీలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. తమకు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు జరిపారని ఆరోపించారు. కాగా, మణికొండ కూల్చివేతలపై వస్తున్న ఆరోపణలపై హైడ్రా కమిషనర్ స్పందించారు. "పరిశీలన జరిపి అక్రమ నిర్మాణాలని నిర్ధారించుకున్నాకే కూల్చివేశాం." అని వివరించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇంటికి సమీపంలో (అర కిలోమీటర్) ఉన్న పలు నివాసాలకు నోటిసులు జారీ అయ్యాయి. వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయం ఎదురుగా ఉన్న భూమిలోని నివాసాల యజమానులకు హైడ్రాలోని డిప్యూటీ సిటీ ప్లానర్ పేరిట హైడ్రా నోటిసులు అందాయి. ప్రభుత్వ స్థలం(యూస్‌ఫగూడ గ్రామం సర్వే నంబర్లు 45,46,47,48లోని 44.38 ఎకరాల భూమి)లో అక్రమంగా భవనాలు నిర్మించారన్న ఫిర్యాదుపై స్పందించిన అధికారులు 70 ఇళ్ల యజమానులకు నోటిసులిచ్చారు.

## కోర్టులు ఆదేశిస్తే తప్ప పని చేయరా?

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులు ఆదేశిస్తే తప్ప అధికారులు పని చేయడం లేదని, మీ విధులు కూడా న్యాయస్థానాలే నిర్వహించాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేసింది. అధికారుల వద్దకు వచ్చే ప్రజల ఫిర్యాదులను పరిష్కరించకపోవడంతో వారు విధిలేక కోర్టులను ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాలు పాటించడంలోనూ అదే నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడింది. ఈ ఒక్క కోర్టు(15వ కోర్టు)లోనే ధిక్కరణ కేసులు 110 ఉన్నాయని చెప్పింది. కోర్టుల ఆదేశాలు, రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు చదువుతూ.. ఆ మేరకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించింది. ఇతర ఉన్నతాధికారులతో రివ్యూ మీటింగ్‌లు పెడుతూ వారికి తగిన సూచనలు అందించాలని కమిషనర్‌ను ఆదేశించింది. హైదరాబాద్ టోలిచౌకిలోని కాశీష్ దుకాణం ముందు అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తమ ముందు హాజరైన జీహెచ్ఎంసీ కమిషనర్‌ను పలు ప్రశ్నలు అడగడంతోపాటు అక్రమ నిర్మాణాలపై అనుసరించాల్సిన విధానంపై సూచనలు చేశారు.

## సభలో అప్పుల గోల..!

హైదరాబాద్, డిసెంబరు 19 : రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర దుమారం చెలరేగింది. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందని అధికారం పక్షం.. ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ రూ.1.27 లక్షల కోట్లు అప్పు చేసిందని బీఆర్ఎస్ దుమ్మెత్తిపోసుకున్నాయి. బీఆర్ఎస్ హయాంలో 7,11,911 కోట్ల అప్పు చేశారని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు. పైగా, రిజర్వ్ బ్యాంక్ 'హ్యాండ్‌బుక్'లో చెప్పినట్లుగా తాము అంత అప్పు చేయలేదంటూ బీఆర్ఎస్ బుకాయిస్తోందని ఆరోపించారు. కార్పొరేషన్ల కోసం తెచ్చిన గ్యారెంటీ అప్పులను ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుందని, అందుకే ఇది కూడా ప్రభుత్వ అప్పుగానే భావించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరాలనే హ్యాండ్ బుక్‌లో పేర్కొన్నట్లు ఆర్‌బీఐ చెబుతోందని, అప్పట్లో ఆర్థిక మంత్రిగా వివరాలు ఇచ్చింది హరీశ్ రావేనని గుర్తుచేశారు. తప్పుడు లెక్కలు చెప్పి, సభను తప్పుదారి పట్టించిన హరీశ్‌పై సభా హక్కుల ఉల్లంఘననోటీసు ఇవ్వాలా? లేక తనపై ఇవ్వాలా? సభనే తేల్చాలని భట్టి అన్నారు. కాగా, తాము చేయని అప్పును తమపై రుద్దుతున్నారని, పదేళ్లలో కేవలం రూ.4.17 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేశామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఇలా అప్పుల అంశం మల్లు భట్టి విక్రమార్క, హరీశ్‌మధ్య తీవ్ర దుమారాన్ని రేపింది. గురువారం ఇలా పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ వేడెక్కింది.

# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా

దేవరకొండ డిసెంబర్ 19 వార్త మిర్రర్ : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో భాగంగా కస్తూర్బా బాలికల విద్యాలయం ఉపాధ్యాయనీయుల సమ్మె బాట పట్టడంతో విద్యార్థినిల బోధన నిలిచిపోయింది అంటూ ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ ధర్నా ను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ నెల 6 నుండి సమ్మె చేస్తున్నా కస్తూర్బా విద్యాలయంలో బోధన సిబ్బంది ( కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్) బోధనేతర సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నారని ఈ సమ్మె వల్ల విద్యార్థులకు బోధనపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో విద్యాబోధన కుంటుపడిందని అన్నారు.టీచర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విద్యార్థినిలకు తక్షణమే తరగతుల నిర్వహణ జరిగేలా చూడాలని విద్యార్థుల జీవితాలతో చెలగటం ఆడకుండా తక్షణమే సమస్యలు పరిష్కరించి ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా సమగ్ర శిక్ష ఉద్యోగ భద్రత కల్పించాలని, వారికి కనీస వేతనం స్కేలు అమలు చేయాలని ప్రతి ఉద్యోగి




జీవిత బీమా 10 లక్షలు ఆరోగ్య భీమా ఐదు లక్షల సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా విద్యాశాఖ నియామకంలో వెయిటేజి కల్పించాలని 61 సంవత్సరాలు నుండి పదవి విరమణ పొందిన వారికీ రిటైర్డ్ బెనిఫిట్ 20 లక్షలు కల్పించాలని ప్రభుత్వం గుర్తింపు కార్డులను జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రామావత్ రాజేష్,రామావత్ చరణ్, మాధవి,శారద, వినోద, పాఠశాల విద్యార్థినీలు పాల్గొన్నారు..



## శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించిన సినీ ప్రముఖులు

ఆమనగల్ డిసెంబర్ 19: వార్తమిర్రర్ : బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ తండ్రి విశ్రాంత ప్రధానో ఉపాధ్యాయులు సి యల్ జంగయ్య యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సినిమా డైరెక్టర్ అంజి శ్రీనివాస్ సినీ హీరో విశ్వ కార్తికేయన్ నిర్మాత రామాంజనేయులు తదితరులు వెల్జాల గ్రామంలోని శ్రీనివాస్ యాదవ్ ఇంటికి చేరుకొని ఆయనను పరామర్శించి ఓదార్చారు. అనంతరం జంగయ్య సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయనను పరామర్శించారు ఈ కార్యక్రమంలో గోద శ్రీరామ్ యాదవ్, పొద్దుటూరి రాజు, యాదయ్య, చంద్రయ్య గౌడ్,తిరుపతయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

# శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో సొంత ఖర్చులతో బోరు

### పట్టణ 20వ వార్డు కౌన్సిలర్, తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర మల్లీశ్వరి శ్రీశైలం యాదవ్

దేవరకొండ డిసెంబర్ 19 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలోని స్థానిక శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో గురువారం నాడు దేవరకొండ పట్టణ 20వ వార్డు కౌన్సిలర్, తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర మల్లీశ్వరిశ్రీశైలంయాదవ్ తన సొంత ఖర్చులతో దేవాలయానికి బోరు వేయించడం జరిగింది. ఈ సందర్భంగా కొండ్ర మల్లేశ్వరి శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో దినదినాభివృద్ధి చెందుతున్న నందున భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ప్రధానంగా నీటి సమస్య ఎక్కువగా ఉందని ఆలయ కమిటీ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న వారు వెంటనే స్పందించి బోరు వేయించడం జరిగింది అని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఆ భగవంతుని ఆశీస్సులతో బోరు బాగా పడటంతో పాటు రాబోవు రోజులలో ఎటువంటి ఇబ్బంది కాకుండా ఇంకొంచెం లోతుగా వేయించానని వారు తెలిపారు. వారితోపాటు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## లగచర్ల రైతులకు బెయిల్ మంజూర్

### బిఆర్ఎస్ పోరాట ఫలితమే.. మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్



కల్వకుర్తి డిసెంబర్ 19 వార్త మిర్రర్ ప్రతినిధి:-బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాల పోరాట ఫలితంతోనే లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు అయ్యిందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో నవంబర్ 11న ఫార్మా విలేజ్ పేరుతో జిల్లా కలెక్టర్,ఇతర అధికారులు భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్ల వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికారులపై దాడి చేశారన్న అభియోగాల కేసులో అరెస్టయి,జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు 24 మంది రైతులకు నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తున్నామని,బీఆర్ఎస్ పార్టీ,గిరిజన సంఘాల పోరాటంతో దాదాపుగా 40 రోజుల తర్వాత రైతులకు బెయిల్ మంజూరైనందుకు దశరథ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు.అమాయకపు గిరిజనులను చూసుకుని దౌర్జన్యంగా వాళ్ల భూములు లాక్కొని అల్లుడికి కట్టబెడదామని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేశారని ఫైర్ అయ్యారు. ఓ పక్క రైతులను జైల్లో వేసుకుంటూ మరోపక్క రైతు పండగ చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన జోష్యం చెప్పారు.

# దేవరకొండలో గిరిజన బాలికల ఆశ్రమంలో ఇంధన పొదుపు వారోత్సవాలు

### విద్యుత్ వృధా చేస్తే భవిష్యత్ తరాలకు అంధకారమే

### నేటి సత్సంకల్పమే రేపటి వెలుగుల సహకారం

### టిజిఆర్ఈడీసీఓ ఉమ్మడి జిల్లా మేనేజర్ మర్రు, పాండురంగారావు

దేవరకొండ డిసెంబర్ 19 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలోని స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం నాడు తెలంగాణ పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా ఇంధన పొదుపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిజిఆర్ఈడీసీఓ ఉమ్మడి జిల్లా మేనేజర్ మర్రు, పాండురంగారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఇంధన పొదుపు పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మనం విద్యుత్ వృధా చేస్తే భవిష్యత్ తరాలకు అంధకారాన్ని మిగిల్చిన వారమవుతామని అని వారు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఇంధనం పొదుపుపై అవగాహన తప్పనిసరి అని తెలిపారు. నేటి సత్సంకల్పమే రేపటి వెలుగుల సహకారం అని విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా చేయవచ్చని అంతేగాక కరెంటును ఆదా చేస్తే భావితరాలకు భరోసానిచ్చిన వారవుతామని అని వారు తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకొని విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు.ప్రధానంగా ఎలక్ట్రిసిటీ, బొగ్గు, డీజిల్, పెట్రోల్ విషయంలో ప్రత్యామ్నాయం ఆలోచించాలన్నారు. క్రమంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గిస్తూనే సౌర శక్తిని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం



ఉందన్నారు. ఈ క్రమంలో ఇంటిపై సోలార్ పలకల ఏర్పాటుతో ఎవరికి వారే విద్యుత్ తయారు చేసుకొని తద్వారా ఎలక్ట్రిసిటీ వాడకాన్ని తగ్గించాలి అని సూచించారు. ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు హాస్టల్ వార్డెన్ శేఖర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయురాలు హనుమకుమారి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు..



## అంబేద్కర్ పై అవమానపరిచిన అమిత్ షా అదే పార్లమెంటులో క్షమాపణ చెప్పాలి: భూక్య సంతోష్ నాయక్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ నిరసన కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ నిన్న భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని అమిత్ షా గారు పార్లమెంట్లో అవమానించడం జరిగింది కుల అహం కారాలతో మతోన్మాదంతో విర్రవీగుతున్న అమిత్ షా కోట్లాదిమంది ప్రజలు ఆరోగ్య దైవంగా భావించే అన్నగారిన వర్గాల ప్రజల ఆశాజ్యోతి అట్టడడుగు వర్గాల ప్రజలను చైతన్యపరిచి వారి జీవితాలు వెలుగులు నింపినటువంటి మహానీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలను రాజకీయ చైతన్యం చేసి భారత రా జ్యాంగం ద్వారా ఈ దేశంలో అందరికీ సమాన హక్కులు కల్పించినటువంటి మహో న్నతమైన వ్యక్తి గురించి ఇలా మాట్లాడడం అమిత్ షా ఇది తగదు, ఎక్కడైతే నువ్వు బాబా సభ అంబేద్కర్ ని అవమానించావు అదే నిండు సభలో కొట్లాది ప్రజల సమక్షంలో పార్ల మెంట్లో క్షమాపణ చెప్పాలి లేనియెడల రాబోయే రోజుల్లో బిజెపికి పార్టీ కి తగిన బుద్ధి చెప్తాం అని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ కుల సంఘాల నాయకులు ప్రజాపతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పత్రిక ఆవిష్కరణ

దేవరకొండ డిసెంబర్ 19 వార్త మిర్రర్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో గురువారం నాడు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల23 నుండి 25 సిద్ధిపేట లో జరగబోయే ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ను స్థానిక ఎంకెఆర్ కళాశాలలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ దేవరకొండ నగర కార్యదర్శి అంకురి శ్రీకాంత్ మాట్లాడుతూ “అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ అన్నారు. వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతీయ పునర్నిర్మాణం సాధ్యం అనే ఉద్దేశ్యంతో పనిచేస్తూ వివేకానందుని స్ఫూర్తితో, అంబేద్కర్ ఆశయ సాధనలో విద్యార్థులను జాతీయవాదులుగా చేస్తున్న విద్యార్థి సంఘం అన్నారు. అన్ని రంగాల విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అనునిత్యం పనిచేస్తూనే, ఎన్నో విద్యార్థి నిర్మాణాత్మక కార్యక్రమాలను నిత్యం చేస్తూనే, సామాజిక ఉద్యమాలను కూడా నిర్వహిస్తుంది. ఉంటుందని అన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది ఏబీవీపీ యొక్క 43వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు సిద్ధిపేటలో డిసెంబర్ 23,24,25 తేదీలలో నిర్వహించడం జరుగుతుంది. ఈ రాష్ట్ర మహాసభలలో తెలంగాణలో నెలకొని ఉన్న విద్యారంగ, రాష్ట్ర, నిరుద్యోగ సమస్యలపై తీర్మానాల ప్రవేశపెట్టి ఉద్యమ కార్యచరణ ప్రకటించడం జరుగుతుందని, ఈ మహాసభలకు విద్యార్థులు, మేధావులు,




నిరుద్యోగులు విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు... ఈ కార్యక్రమం లో కార్తీక్,సాయి, కావ్య, ఊర్మిళ, రుక్మిణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



## మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 19 : ఎస్ సి వర్గీకరణ నకు వ్యరేకంగా హలో మాల చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా రాయికల్ పోలీస్ లు మండలం లోని నాయకులు జాన గోపి డా.బి.ఆర్ అంబెడ్కర్ నేషనల్ అవార్డ్ గ్రహీత, తెలంగాణ మలమహనాడు యువజన రాష్ట్ర అధ్యక్షులు, మరియు మలమహనాడు రాష్ట్ర కార్యదర్శి వేల్పుల ప్రవీణ్ కుమార్ ను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగింది. ఈ సందర్బంగా జాన గోపి మాట్లాడుతూ రిజర్వేషన్లు పూర్తిగా తొలగించడానికి పన్నిన పన్నాగామే ఈ వర్గీకరణ, మా ఓట్లతో గెలిచి మమ్మల్ని విభజించి పాలించాలనే కుట్రలో భాగంగా వర్గీకరణ అంశం ను తెరపైకి తీసుకువచ్చారుఅని అన్నారు. మీకు నిజంగా దళితులపై ప్రేమ ఉంటే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేసినారు. అరచేతులు అడ్డు పెట్టి సూర్యుణ్ణి ఆపలేరు.. ఎన్ని అరెస్టులు చేసిన మాలల ఉద్యమాన్ని అనుచలేరు మా దళితుల ఐక్యత ను విడదీయలేరు అని నినదించారు.



## సిపి విచ్చేసి బందోబస్తు విధులను పర్యవేక్షించడం జరిగినది

విశాఖపట్నం వార్త మిర్రర్ : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు దేవస్థానం వద్ద బందోబస్తు విధులను పర్యవేక్షించిన నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., మార్గశిర మాసం, మూడవ గురువారం సందర్భముగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు దేవస్థానంనకు దర్శన నిమిత్తం ఎక్కువ మంది భక్తులు వచ్చు సందర్భంగా, సిపి విచ్చేసి బందోబస్తు విధులను పర్యవేక్షించడం జరిగినది. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న అధికారులు మరియు సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగినది, టాయిలెట్స్ దగ్గరలో పెట్టమని , క్యూ లైన్లో ఉన్న వారికి మజ్జిగ ప్యాకెట్లు, త్రాగు నీరు పంపిణీ చేయమని తెలిపారు , బందోబస్తు వచ్చిన పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను పరిశీలించిన సిపి అక్కడే అధికారులు మరియు సిబ్బందితో కలిసి భోజనం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డీసీపీ-02 ,ఆలయ అధికారులు, హార్బర్ ఏసిపి గారు, వన్ టౌన్ సిఐ గారు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## నూతన కార్యకవర్గాన్ని సన్మానించిన భోగ శ్రావణి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 19 : బిజెపి సంస్థాగత పర్వం (2024) కార్యక్రమంలో భాగంగా జగిత్యాల నియోజకవర్గంలోని జగిత్యాల పట్టణంలో బూత్ అధ్యక్షులుగా ఎన్నికైన దూరిశెట్టి మమత (191), మేడిపల్లి పుష్ప రెడ్డి (142), అధ్యక్షులు మరియు బూత్ ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన వారికి బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు తో కలిసి అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల్ నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు రాగిళ్ల సత్యనారాయణ, యాదగిరి బాబు, పట్టణ ఉపాధ్యక్షులు గదాసు రాజేందర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు మామిడాల రాజుగోపాల్, కాశెట్టి తిరుపతి, బూత్ కమిటీ సభ్యులు, నాయకులు తదితరు పాల్గొన్నారు.

# దేవరకొండ వైష్ణవి గార్డెన్స్‌లో ఘనంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ

### సరబు కుటుంబ సమేతంగా శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం





దేవరకొండ డిసెంబర్ 19 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్ లోని వైష్ణవి ఫంక్షన్ హాల్ లో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని వైష్ణవి ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. వైష్ణవి ఫంక్షన్ హాల్ లో ప్రత్యేకంగా అయ్యప్ప స్వామి వేదికను పచ్చదవరణాలతో పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ మహా పడిపూజ దేవరకొండ అయ్యప్ప స్వామి దేవాలయ గురు స్వాములు చిలువేరు చంద్రమౌళి, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పడిపూజ మహోత్సవన్ని స్వామియే శరణం అయ్యప్ప శరణం.. శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారు మోగాయి.శబరిమలై సన్నిధిని తలపించేలా ప్రత్యేక అలంకరణ చేశారు. అష్టాదశ కలశాలతో అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం చేసి కనుల పండుగగా అయ్యప్ప మహా పడి పూజను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 మెట్ల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి మహా శివుని అయ్యప్ప, గణపతి, కుమార స్వామి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. ఈ మహా పడిపూజ అభిషేకం మహా పడిపూజ దాత గురు స్వామి సరభు సాయి శంకర్ నిర్వహించగా వారి కుటుంబ సభ్యులు శ్రీ సరాబు ధనుంజ య సుకన్యరాణి కిరణ్ లావణ్య జగదీష్ జ్యోతి అఖిల వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో పాటు పడి పూజకు పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారణ స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహోత్సవంలో పాల్గొన్న గురుస్వాములకు నిర్వాహకులు సరాబు కుటుంబ సమేతంగా గురుస్వాములను శాలువాతో సత్కరించారు. అయ్యప్ప మాలధారణ స్వాములకు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.





# దేవరకొండలో ఆవారా ఆకతాయిలకు పోలీసుల చబుత్ర ఆపరేషన్

### ఆపరేషన్ చబుత్ర తో ఆవారా ఆకతాయిల ఆటకట్టు

### గొడవలు,అనుమానస్పదంగా రోడ్లపై తిరుగుతున్న వారిని ఉపేక్షించేదిలేదు

### సీఐ, ఎస్సైలు,కానిస్టేబుల్ లతో బృందాలుగా పట్టణం అష్టదిగ్బంధం

దేవరకొండ డిసెంబర్ 19 వార్త మిర్రర్ : ఆపరేషన్ చబుత్ర తో ఆవారా ఆకతాయిల ఆటకట్టించిన జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకొండ డిఎస్పీ ఆధ్వర్యంలో దేవరకొండ పోలీసులు బుధవారం నాడు అర్ధరాత్రి పూట ఆవారాగా తిరుగుతున్న ఆకతాయిల ఆటకట్టించేందుకు పోలీసులు కొత్త ఆపరేషన్ మొదలు పెట్టారు. ఆపరేషన్ చబుత్ర పేరున చేపట్టిన ఆపరేషన్ లో అర్ధరాత్రిళ్లు ఆరుబయట అరుగుల మీద కూర్చొని బాతాకానీలు కొడుతున్న ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి దేవరకొండ పట్టణంలో సీఐ, ఎస్సైలు,కానిస్టేబుల్ లతో బృందాలుగా, దేవరకొండ పట్టణాన్ని అష్టదిగ్బంధం చేశారు. రోడ్లపై అర్ధరాత్రి ఆవారాగా తిరుగుతూ అనుమానాస్పదంగా ఉన్న 30 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ చేశారు. వీరందరి నుంచి బైకులు,2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 8 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

**ఆవారా ఆకతాయిలకు కౌన్సిలింగ్**

అర్ధరాత్రి అరుగుల (చబుత్ర) మీద బాతకానీలు కొడుతూ, రోడ్లమీద ఇష్టానుసారం బైకులపై తిరుగుతూ కాలనీ వాసులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై పోలీసులు ఫోకస్ పెడు తున్నారు. తప్ప తాగి వాహనాలపై తిరుగుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతూ.. గొడవలు సృష్టిస్తున్న, అనుమానస్పదంగా రోడ్లపై తిరుగుతున్న వారిని ఉపేక్షించమని పోలీసు అధికా రులు హెచ్చరించారు. అలాగే ఇప్పుడు జరుగుతున్న నేరాల్లో ముఖ్యంగా మైనర్లు, 30 సంవత్సరాల లోపు ఉన్నవాళ్లే అధికంగా ఉంటున్నారని, వీళ్లకు కౌన్సిలింగ్ ఇస్తామని ప్రకటించారు. దేవరకొండ పట్టణాన్ని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. దీనికి పట్టణ వాసులు సహకరించాలి అని దేవరకొండ సిఐ నరసింహులు కోరారు. బుధవారం రాత్రి పట్టుబడిన వారందరినీ వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో ఎలాంటి కారణం లేకుండా ఆవారాగా తిరగడం, తాగి వాహనం నడపడం వల్ల జరిగే నష్టాల గురించి మరో సారి కూడా కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.





# దేవరకొండ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు ఆర్థికసహాయం

### విద్యార్థుల తరగతి గదులలో లైట్లు ఫ్యాన్లకు సహకరించిన పూర్వ విద్యార్థులు

దేవరకొండ డిసెంబర్ 19 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఇల్లెందుల రవికుమార్ వరలక్ష్మి ల జ్ఞాపకార్ధంగా పాఠశాలలో లక్ష రూపాయలతో విద్యార్థులకు గదులలో విద్యుత్ సామాగ్రి ఫ్యాన్లు, ఇల్లందుల శ్రావణ్ కుమార్ సహకారం ఇన్ వేటర్ లను పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుత పాఠశాల ప్రిన్సిపాల్ చెరుపల్లి శ్రీనివాస్ కు అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పూర్వ విద్యార్థులు ప్రసంగించారు. విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం గురించి చూద్దామని చదువుతూనే వారి జీవిత లక్ష్యాలను అధిరోహిస్తారని చదువు పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ అవకాశాలు ఉండవని వారు తెలిపారు. చదువుతూనే పూర్తిస్థాయిలో ప్రపంచం వైపు ముందడుగు వేయడానికి మొదటి మెట్టుగా చదువు మాత్రమే ఉంటుందని విద్యార్థులకు విద్యార్థి దశలోనే చదువు ప్రామాణికమని వారు విద్యార్థులకు తెలిపారు. విద్యార్థి దశలోనే ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటు చదువుపై మక్కువతో మరింత ముందడుగు వేసే దిశగా చదువుపై తోటి విద్యార్థులతో పోటీ తత్వం దిశగా శ్రద్ధ వహించాలని వారు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం పాఠశాలకు సహకరించిన పూర్వ విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు పూర్వ విద్యార్థులను పూలమాలతో సగర్వంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితోపాటు ఇల్లందుల శ్రావణ్ కుమార్ దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ ఇల్లందుల బుచ్చి రాములు ఎల్ఐసి ఎస్బిఎమ్ రాము చౌహాన్ జీస్ ఆనంద్ గుద్దేటి జంగయ్య పందిరి వెంకన్న బాల గణేష్ శ్రీను పాఠశాల ప్రధానోపాధ్యా యులు చేరుపల్లి శ్రీనివాస్ నాట్య మయూరి అక్షర వెంకటేశ్వర్ పెద్దన్న బక్కయ్య శ్రీపతిరావు కే పండరీనాథ్ సంతోష్ రెడ్డి సైదులు కే శ్రీనయ్య నాగరాజు చంద్రయ్య నోకియా భాగ్య జగదీశ్వర్ ప్రవీణ్ నాగవాణి కళ్యాణి విజయ విద్యార్థులు పాల్గొన్నారు..



## ఫోరమ్ అఫ్ ఫిజికల్ సైన్స్ రాయికల్ మండలం నూతన కార్యవర్గం ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 19 : ఫోరమ్ అఫ్ ఫిజికల్ సైన్స్ రాయికల్ మండల శాఖ కార్యకవర్గాన్ని గురువారం రోజున జిల్లా అధ్యక్షులు మచ్చ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యవర్గంలో మండల అధ్యక్షులుగా బొల్లె చిన్నయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ భూపతిపూర్, ప్రధాన కార్యదర్శి గా పొన్నం రమేష్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఉపాధ్యక్షురాలు ఏ. పద్మ జిల్లా పరిషత్ హై స్కూల్ రాయికల్, ట్రీజరర్ గా పొత్తూరి రవీందర్ జిల్లా పరిషత్ హై స్కూల్ తట్లవాయి ఎన్నికయినారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మామీద నమ్మకంతో ఎన్నుకున్న ఫోరమ్ సభ్యులకు ధన్యవాదములు తెలియజేస్తూ సహకరించిన జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్కు వినతి




మిర్యాలగూడ డిసెంబర్ 19:-( వార్తమిర్రర్): మునిసిపాలిటీలలోని పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం (మెప్మా)లో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్(ఆర్పీల) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ కు వినతిపత్రం ఆర్పీల యూనియన్ సమర్పించిన అనంతరం స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్ కు వినతిపత్రం అందజేసి గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నామమాత్రపు వేతనాలపై పని చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మునిసిపాలిటీలలో మెప్మా విభాగంలో సుమారు 6,000 మంది ఆర్పీలు పనిచేస్తున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల, ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్, దివ్యాంగుల సంఘాల బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజ్ రుణాలు అన్ని రకాల పనులు చేస్తున్న తమకు జిఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఒకే డ్రెస్ కోడ్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జాజుల చంద్రకళ, నాయకులు ధూళిపాళ కళావతి, ఎస్కే షాజహా, కె.రజిత, ఎన్.సరితలు పాల్గొన్నారు.




## రిటైర్మెంట్ బెనిఫిట్స్ పర్మినెంట్ ఇన్సూరెన్స్ ప్రతి కార్మికునికి 26 వేల వేతనం ఇవ్వాలి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 19 : గ్రామపంచాయతీ కార్మిక సమస్యలపై హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ పోతున్న గ్రామపంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు చేయడం ఖండిస్తూ చౌటుప్పల్ మండలం ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కన్వీనర్ ఆదిమూలం నందీశ్వర్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా ముఖ్యఅతిథిగా పాల్గొని ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను అట్లాగే చౌటుప్పల్ మండలంలో గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేదన ఇవ్వాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని రెండవ పిఆర్సి అమలు చేయాలని గ్రామపంచాయతీలో అదనంగా తీసుకున్న కార్మికులను ఆన్లైన్లో నమోదు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పర్మినెంట్ ఇన్సూరెన్స్ ప్రతి కార్మికునికి 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని అట్లాగే ఎంపీడీవో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు నాయకులు మాంద్ర శీను పాపయ్య ఎర్ర పెంటమ్మ లక్ష్మమ్మ మంగమ్మ నరసింహ తదితరులు పాల్గొన్నారు..



PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR : YADADRI-BHUVANAGIR DISTRICT:
Present: Sri.M. Hanumantha Rao, IAS.,

Rc.No. 3324/B7/MDM/2024 Dated:19.12.2024

Sub:- **Public Services** – Sri.P.Venkatesham, Principal TGREI Survel, Narayanpur (M) Yadadri-Bhongir District – Shown negligence in discharging his legitimate duties – Suspension from Service – Orders – Issued.

Read:- 1. Report of the Principal TGRS Survail, Naryanapur Mandal
2. Report of the Mandal Educational Officer Narayanapur
3. Report of the Dist.Educational Officer, Yadadri-Bhongir

-:p:-

Whereas it has come to the notice of the undersigned who is the competent authority vide reference 1st to 3rd cited that, Sri.P.Venkatesham, Principal TGREI Survel, Narayanpur (M) Yadadri-Bhongir District has shown negligence and irresponsibility in discharging his legitimate duties and due to his inaction one student by name Shivaratri Samuel S/o Yadagiri, age 14years studying in 8th class was injured on 18.12.2024 while serving ragijava in the school premises due to which adverse news published in daily newspapers thereby damaging the reputation of the institution (Reasons for suspension)

And whereas disciplinary proceedings against Sri.P.Venkatesham, Principal TGREI Survel, Narayanpur (M) Yadadri-Bhongir District are contemplated. And whereas the Government of Telangana / undersigned after careful consideration of the available material and having due regard to the circumstances of the case are satisfied that it is necessary to place Sri.P.Venkatesham, Principal TGREI Survel, Narayanpur (M) Yadadri-Bhongir District kept under suspension on public interest with immediate effect.

Now, therefore in exercise of the powers conferred by sub-rules (1) of rule 8 of Telangana Civil Services (CCA) Rules, 1991, the undersigned here by placed Sri.P.Venkatesham, Principal TGREI Survel, Narayanpur (M) Yadadri-Bhongir District under suspension in public interest until the conclusion of the disciplinary proceedings.

It is further ordered that during the period of this order remaining in force, the headquarters of Sri.P.Venkatesham, Principal TGREI Survel, Narayanpur (M) Yadadri-Bhongir District shall be at Survel, Narayanpur (M) and the said Sri.P.Venkatesham shall not leave the Headquarters without obtaining the prior permission of the undersigned.

The individual is eligible to get subsistence allowance as per rules.

District Collector,
Yadadri-Bhuvanagiri district.

To
Sri.P.Venkatesham, Principal TGREI Survel, Narayanpur (M) Yadadri-Bhongir District (through MEO Narayanpur).
Copy to the Mandal Educational Officer Narayanpur with a request to serve these orders to the individual concerned and submit the acknowledgement.
Copy to the DTO/STO concerned.
Copy to the Secretary TGREI Society Hyderabad with a request to ratify the actin taken in the matter.

## సర్వేల్ గురుకులం ప్రిన్సిపల్ నీ సస్పెండ్ చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 19:( వార్త మిర్రర్) : నారాయణపూర్ మండలం కేంద్రంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో బుధవారం వంట మనిషి లేకపోవడం వలన 8వ తరగతి చదువుతున్న శివరాత్రి శ్యాముల్ తో పని చేయించడం జరిగింది. ఈక్రమంలో వేడి రాగి జావ కాళ్ల మీద పడి గాయాల పాలు కావడం వలన. విద్యార్థి సంఘాలు, పిల్లల తల్లిదండ్రులు గురువారం రోజు కళాశాల గేటు ముందు బైఠాయించి ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేయాలని ధర్నా చేయడం జరిగింది. ఈ విషయం తెలిసిన జిల్లా కలెక్టర్ దీనికి కారణమైన సర్వేల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్ పర్యవేక్షణ లోపం ఉండడం వలన ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు... గాయపడిన విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం అపోలో ఆసుపత్రికి తరలిస్తున్నట్టు తెలిపారు.

# జిడబ్ల్యూపిసి సహాయంతో ఇండియాకు పయనం

### సహాయం చేసిన పెనుకుల అశోక్




వార్త మిర్రర్ మల్లాపూర్ డిసెంబర్ 19 : మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబమైన బుడగ జంగాల కళాకారుడు మంత్రి పెద్ద కుమారుడు ఆకుల రమేష్ 30 అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం గత సంవత్సరం క్రితం 1,50,000 అప్పుచేసి దుబాయ్ వెళ్ళగా అక్కడ సరైన ఉపాధి లేక కంపెనీ నుండి బయటకు వచ్చి కలివిల్లి ఐ సోనాపూర్ లో ఉంటుండగా అప్పులు తీర్చలేక పని దొరకక మనస్థాపంతో గత వారం రోజుల క్రితం గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తోటి రూమ్ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడి పోలీస్ లు హాస్పిటల్ లో ట్రీట్మెంట్ నిమిత్తం జాయిన్ చేసి కుటుంబ సభ్యులకు తెలియజేయగా కుటుంబ సభ్యులు మండల కేంద్రానికి చెందిన జ్యోతి రిపోర్టర్ నీ మోర సతీష్ ని సంప్రదించగా అతను గల్ఫ్ లో ఉంటున్న గల్ఫ్ సేవా సమితి సభ్యులు పెనుకుల అశోకుని సంప్రదించగా వెంటనే అతను జిడబ్ల్యూపిసి అధ్యక్షులు గుండెల నర్సింహులు కి గల్ఫ్ జేఏసీ అధ్యక్షులు రవి గౌడ్ కు వివరాలు తెలియజేసారు వారు పూర్తి భరోసాతో ఇండియాకు అతనిని పంపించడనికి సానుకూలంగా స్పందించారు. పెనుకుల అశోక్ అనే వ్యక్తి దగ్గరుండి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ ఆకుల రమేష్ నీ దగ్గరుండి ఇండియన్ ఎంబసీకి తీసుకెళ్లి అవుట్ పాస్ పోర్ట్ ఇప్పించి గురువారం రోజున తెలంగాణలో తన స్వగ్రామమైన మల్లాపూర్ కి పంపించారు. స్వదేశానికి రప్పించడానికి సహకరించిన పెనుకుల అశోక్ రిపోర్టర్ మోర సతీష్ ని ధబ్బిడి రవి, ఆకుల తరుణ్, కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ అబిదా జూనియర్ కాలేజ్‌లో నిబంధనల విరుద్ధంగా నిర్వహిస్తున్న ఐపీ తరగతులను నిలిపివేయాలి

### నిబంధనలు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న శ్రీ అబిదా కాలేజీ పట్ల సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి

### విద్యార్థి సంఘం నాయకుల డిమాండ్



ఎల్బీనగర్,19 డిసెంబర్ : నిబంధనలకు విరుద్ధంగా అకాడమీ ముసుగులో ఉప్పర్పల్లిలో శ్రీ అభిద జూనియర్ కాలేజీలో ఐపీ తరగతులు అఫిలియేషన్ లేకుండా నిర్వహిస్తున్న యాజమాన్యం పట్ల తగిన చర్యలు తీసుకొని విద్యార్థులు అంతిమంగా నష్టపోకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మిక్సస్డ్ అక్యుపెన్సీ ఉన్నటు వంటి బిల్డింగ్ పర్మిషన్ వచ్చే పరిస్థితినే లేదు ఐనా యాజమాన్యాలు విచ్చలవిడిగా సంస్థల్ని నెలకొల్పి విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకుంటూ లక్షల ఫీజు లు గుంజడమే ధ్యేయంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ విద్యా సంస్థల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులపై ఇప్పుడే ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు కూడా చదవాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఈ కాలేజీలో చదవడం ఇష్టం లేకపోయినప్పటికీ ఏళ్ళిపోతం వేరే కాలేజీలో జాయిన అవుతం అన్నా కూడా పర్మిషన్ ఇవ్వక పోగా ఇంటర్ సెకండియర్ ఫీజు చెల్లిస్తేనే పంపిస్తామని బలవంతం చేస్తున్నారని చెప్పారు. విద్యార్థుల తల్లిండ్రులు ఎన్నిసార్లు మాట్లాడినా పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అన్ని పర్మిషన్లు ఉన్నాయంటూ ప్రగల్భాలు పలుకుతూ ప్రభుత్వ పోకడలను తప్పుదోవ పట్టిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. తక్షణమే వీరి పట్ల డి ఐ ఈ ఓ, బోర్డు సెక్రెటరీ లు వెంటనే చర్యలు తీసు కోవాలని తెలంగాణ విద్యార్థి సమితి స్టేట్ ప్రెసిడెంట్ మంద రమేష్ మాదిగ, బీసీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు వద్దేపల్లి రాకేష్, తెలంగాణ స్టూడెంట్ జేఏసీ స్టేట్ సెక్రటరీ అమనగల్ రాజు లు డిమాండ్ చేశారు.

# జనవరి 04న విశాఖ వేదికగా నావికాదళ విన్యాసాలు

### ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

### భాగస్వామ్యం కానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

విశాఖపట్టణం వార్త మిర్రర్ : డిసెంబర్ 04న జరిగే నేవీ డేను పురస్కరించుకొని దానికి అనుబంధంగా జనవరి 04వ తేదీన విశాఖ వేదికగా నిర్వహించనున్న నావికాదళ విన్యాసాలకు పక్కా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి భాగస్వామ్యం కానున్నారని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రధాన వేదిక సమీపంలో గ్రీన్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందీ రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ క్రమంలో అన్ని విభాగాల అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేసి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని, వేడుకలను సౌకర్యవంతంగా వీక్షించేలా ఎక్కడికక్కడ ఎల్.ఈ.డి. స్క్రీన్లను ఏర్పాటు చేయాలన్నారు. జనవరి 04 సాయంత్రం ఆర్.కె. బీచ్ ప్రాంతంలో ఓపీ డెమో జరుగుతుందని, వాటితో పాటు లేజర్ షో, డ్రోన్ షో, నౌకల పైనుంచి విన్యాసాలు కూడా



ఉంటాయని నేవీ అధికారులు పేర్కొన్నారు. జనవరి 02వ తేదీన ఫుల్ రిహార్సల్స్ జరుగుతాయని వెల్లడించారు. నేవీ తరఫున అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని, క్రంటోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, డీసీపీ అజిత, కమాండర్లు వై.కె. కిషోర్, మనోజ్ కుమార్, లెఫ్టినెంట్ కమాండర్లు సంజీబ్ శరణ్, ఉజైర్ కుస్రో, డీఆర్వో బీహెచ్. భవానీ శంకర్, ఇతర విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్లోకి కియా సైరోస్




న్యూఢిల్లీ, డిసెంబర్ 19: కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా..మరో ఎస్‌యూవీ సైరోస్ మాడల్‌ను పరిచయం చేసింది. నాలుగు మీటర్ల లోపు పొడువు కలిగిన ఈ మాడల్ కంపెనీ నుంచి విడుదలైన మూడో ఎస్‌యూవీ మాడల్ ఇదే కావడం విశేషం. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ మాడల్‌లో ఆరు-స్పీడ్ మాన్యువల్, 7 స్పీడ్ డీసీటీ గేర్‌తో తీర్చిదిద్దింది. అలాగే 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్ కలిగిన మాడల్‌లో ఆరు స్పీడ్ మాన్యువల్ ఉన్నాయి. అడ్వాన్స్ ఫీచర్స్‌తో తయారైన ఈ మాడల్‌లో 12.3 ఇంచుల టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, నాలుగు డిస్క్ బ్రేక్‌లతో ఏబీఎస్, ముందు-వెనుక పార్కింగ్ సెన్సార్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ కారు ధర సంస్థ ప్రకటించకపోయినప్పటికీ ధర మాత్రం రూ.12 లక్షల నుంచి రూ.22 లక్షల లోపు ఉంటుందని అంచనా.



# 79 వేల దిగువకు పుత్తడి

### మరో రూ.1,000 వరకు తగ్గిన తులం ధర

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: బంగారం ధరలు శాంతించాయి. ఆభరణాల వర్తకులు, అంతర్జాతీయంగా డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు దిగొచ్చాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.79 వేల దిగువకు రూ.78,300కి పడిపోయింది. అంతకుముందు ఇది రూ.79,100 గా ఉన్నది. అమెరికా ఫెడ్ రిజర్వ్ కఠిన ద్రవ్య వైఖరే ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. కిలో వెండి ఏకంగా రూ. 2,000 తగ్గి రూ.90 వేలుగా నమోదైంది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.710 తగ్గి రూ.77,130కి దిగిరాగా, 22 క్యారెట్ ధర రూ.650 తగ్గి రూ.70,700కి తగ్గింది. ఇదిలా ఉంటే అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,634 డాలర్లకు, వెండి 29.90 డాలర్లకు తగ్గాయి.



# జాజుల శ్రీనివాస్ గౌడ్‌కి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 19 : చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో గల అయ్యప్ప స్వామి దేవాలయానికి విచ్చేసిన జాజుల శ్రీనివాస్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా ఆలయానికి ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులతో ఆశీర్వాదం తీసుకున్నారు.అయ్యప్ప దేవాలయ గురు స్వాములు ఆయనను ఘనంగా శాలువులతో సత్కరించారు.ఈ సందర్భంగా బొబ్బిళ్ళ మురళి గురు స్వామి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బీసీల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ ను కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ఆయనకు సముచిత స్థానం కల్పించాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నారు.నిరంతరం పోరాటం చేస్తున్న వ్యక్తులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పాటి శంకర్ గురు స్వామి మరియు గురు స్వాములు చింతల సాయిలు అంతటి రాము గౌడ్ పెద్దగోని రమేష్ గౌడ్ సుక్క సుదర్శన్ కందుల వెంకటేశం గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.





# ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 19....తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ ఫౌండర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డవ్ మినిస్ట్రీస్ పాస్టర్ అల్లూరి సతీష్ వారి సతీమణి అల్లూరి సతీష్ రాజు విచ్చేసి క్రిస్మస్ సందేశాన్ని ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ యుద్ధనౌక కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ మెంబర్ వరంగల్ రవి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, డిబిఎస్ఏ స్టేట్ కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, ఓయూఎన్ ఎస్ యుఐ జనరల్ సెక్రెటరీ వెంకట్ ముదిరాజ్, టిడిఎస్ ఎఎఫ్ అధ్యక్షులు విజయ్ నాయక్ ,విద్యార్థి నాయకులు ప్రణయ్, గడ్డం అశోక్, మంద రాజు మాదిగ, చరణ్ మోర్య , సతీష్ , రవీందర్, రవి , ఏసు తదితరులు రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు .



### ఇసుక సరఫరా కేంద్రాలు

### బ్లాక్ మార్కెట్ ను నివారించేలా చర్యలు పల్లా

విశాఖపట్నం వార్త మిర్రర్ : మిందిలో ఇసుక సరఫరా కేంద్రాన్ని ప్రారంభించిన తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుభూగర్భ గనుల శాఖ ఆదేశాల మేరకు ఏర్పాటు టన్ను ఇసుక ధర వెయ్యి రూపాయలు అక్రమాలకు తావు లేకుండా ఇసుక సరఫరా పల్లా నిర్మాణ రంగాన్ని ఆదుకోవడం కోసం ప్రాంతాల వారీగా ఇసుక సరఫరా కేంద్రాలు పల్లాబ్లాక్ మార్కెట్ ను నివారించేలా చర్యలు పల్లా




### జియో సరికొత్త ప్లాన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో..ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి సరికొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే టారిఫ్ చార్జీలు పెంచి వినియోగదారులకు షాకిచ్చిన జియో..ఈసారి మాత్రం చౌకైన ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. 98 రోజుల కాలపరిమితితో రూ.999 ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ కాల్స్‌తోపాటు రోజుకు 2 జీబీ డాటా చొప్పున 196 జీబీల డాటాను పొందవచ్చును. ఈ డాటా అయిపోయిన తర్వాత ఇంటర్నెట్ స్పీడ్ 64 కేబీపీఎస్‌కి పడిపోనున్నది. ప్రస్తుతం సంస్థకు 49 కోట్ల మంది మొబైల్ కస్టమర్లు ఉన్నారు.